10

# జోడెద్దులు-ఎకరం నేల

ఆకాశమంతా ఓ క్షణం, వెలుతురుతో చీరుకు పోయింది. ఆ వెంటనే చెవులు బద్దలయ్యేలాగా ఉరుము - రివ్ రివ్ మని ఈదురుగాలి, కిటికీల్లోంచి దూసుకొని గదిలో కొచ్చాయి.

"ఈ వాన తగ్గేలా లేదు" అన్నాడు నాగభూషణం.

రామ్మూర్తి పలకలేదు. సిగరెట్టును కసిగా తాగి, యాష్ ట్రేలోకి దాన్ని నొక్కి, వేళ్ళు మెటికలు విరుచు కొన్నాడు

"అదే గమ్మత్తు. అంతా మన ఇష్ట ప్రకారం మనక్కా వలసిన విధంగా, జరగా లనుకొంటాం. కానీ జరగదు...అలా జరక్క పోవడమే మంచి దనుకొంటాను ... ఏమంటావురా ?" అన్నాడు రామ్మూర్తి కిటికీతలుపు వేస్తూ.

నాగభూషణం శాలువా కప్పుకొని కాళ్ళార జాపి కూచున్నాడు.

"వయస్సు పెరిగిన కొందికీ, మనిషి లోపలా, వెలుపలా ఎదిగిన కొందికీ, జీవితం అయోమయంగా, అర్ధరహితంగా తయారవు తున్నట్లు కనిపిస్తుంది. ఎందుకు చదువుతాం?

ఎందుకు రాస్తాం? ఎందుకు సంపాదిస్తాం? దేనికోసం ఇదంతా? ఛస్తే జవాబులు చెప్పుకోలేం? కానీ—ఒకప్పుడీ ప్రశ్నలే తట్టేవి కావు. అన్నింటికీ ఓ లక్ష్యం, ఓ ప్రయోజనం కనిపించేవి. ఏదో ధ్యేయం ఉండేది. దాని కోసం చచ్చేట్టు పాకులాడేవాళ్ళం. ఇప్పుడా ధ్యేయం లేదు. లక్ష్యం లేదు. థ్రిల్ లేదు. రొటీన్ బ్రతుకు, ఇందులో ఇమడలేం. దీన్నించి బయట పడలేం ... అదీ - మనం సుఖపడలేక పోవడానికి కారణం. ఏమంటావురా? అన్నాడు రామ్మూర్తి.

"వింటున్నాను" అన్నాడు నాగభూషణం అరచేతులతో ముఖాన్ని రుద్దుకొంటూ.

"నేను సాధారణంగా అందరి దగ్గరా బైటపడను. ఎంచేతనంటే, నా ధోరణి అందరికీ గిట్టదు ... నేను అప్పుడప్పుడు 'మందు' తీసుకొంటాను. ఆ మత్తులో పడి ✱తాన్ని మరచి పోతాను. నాచుట్టూ తారసిల్లే సమస్యలనుండి తప్పుకొంటాను. రొటీన్ నుండి మార్పుకోసం తాగుతాను ... ఈ పని నేను చేయకపోతే - ఎప్పుడో ఆత్మహత్య చేసుకోవలసి వచ్చేది. నేను చచ్చి, వీళ్ళనందరినీ దిక్కులేని పక్షులుగా చేయడం కన్నా — ఇదే నయమనిపించింది. నాకు..." అన్నాడు రామ్మూర్తి.

ఆల్ మెరాతోంచి రెండు గ్లాసులు తీశాడు. సోడాలు తీశాడు. లేత గోధుమరంగులో ఉన్న సీసా తీశాడు. గ్లాసులు నింపాడు. ఒకటి తను అందుకొన్నాడు. మరొకటి నాగభూషణ

ణానికి ఇచ్చాడు.

"నువ్వు కొ త్తవాడి వనుకొని, 'లైట్' చేశాను. కావ లిస్తే కొంచెం 'స్ట్రాంగ్' చేసుకో" అన్నాడు రామ్మూర్తి.

నాగభూషణం గ్లాసును వాసన చూసి, ఓ గుక్క పీల్చి, స్టూలుమీద ఉంచాడు. రామ్మూర్తి సగం గ్లాసు పీల్చేశాడు. సిగరెట్టు ముట్టించాడు—

"మనం గుంటూరులో ఉన్నప్పుడు" అంటూ ప్రారం భించాడు రామ్మూర్తి.

*　　　*　　　*

అప్పటికి గుంటూ రింతగా పెరగలేదు. ఇన్ని పొగాకు కంపెనీలు లేవు. ఇంత డబ్బు లేదు. కొరిటెపాడు మీదుగా రింగ్ రోడ్డున బయలుదేరితే, బిషప్ సెంటర్ మినహా మరో కొంప కనిపించేది కాదు. ఇక అటువీధి కెడితే కిష్టయ్యగారి సెంటర్ ఉండేది. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో నేనా సెంటరులో పనిచేశాను. ఏం పని చేశావని అడక్కు. ఆఫీసర్‌గా చేరాను. చేరానన్నమాటేగాని, ఆ పని నాకేమీ అబ్బలేదు...

తిన్నగా ఉన్నట్టయితే నా జీవితం ఇంకోలా ఉండేది. మిలటరీలో పెద్ద ఉద్యోగం. వేలమీద జీతం. కారు, బంగళా, నౌకర్లు, ఇదంతా ఉండేవేమో! కాని నా కా అదృష్టంలేదు. లేదని ఇప్పుడనుకొంటున్నాను గానీ, ఆ రోజుల్లో నాకీ ఆలో చనే కలగలే దనుకో నాగభూణం!

దీని క్కారణం ఏమి టనుకొన్నావ్?

రమణ !

ప్రతీ ఆదివారం, ఊళ్ళోకి పోవడానికి, ఆఫీసర్లు పర్మిషన్ ఇచ్చేవారు. ఆరు రోజులపాటు, డ్రిల్లులో, వర్కుషాపులో పనితో, చీవాట్లతో, నలిగిపోయిన జనానికి, ఆదివారం అంటే బ్రహ్మానందంగా ఉండేది. ఉదయం పోయిన పోకడ ఇక రాత్రి ఎనిమిదింటికిగానీ, మళ్ళీ బారక్సుకు వచ్చే వాళ్ళు కాదు. రోజల్లా తినడం, త్రాగడం, సినిమాలు, అమ్మాయిలు-డబ్బంతా ఖర్చుచేసి, లెఫ్ట్ రైట్ కొట్టుకుంటూ వచ్చేవాళ్ళు,

రమణను, ఓ ఆదివారం బాంబేటాకీస్ దగ్గర చూశాను. నాకు జ్ఞాపకమున్నంత వరకూ, అదే మొదటిసారి ఆమెను చూడడం. మనిషి ఎరుపు కాదు. కొంచెం బొద్దుగా, నా భుజాల దాకా వచ్చేది. తెల్లని అంటుజోడు, మెళ్ళో శంఖు తావళం, నీలం రాళ్ళు తాపిన బేసరి; తల్లో నాగరం,— అద్భుతంగా ఉండేది. పరిచయం ఎలా అయిందో తెలుసా? 'కిస్మత్' పిక్చర్ ఆడుతున్నారు. అశోక్‌కుమార్, ముంతాజ్ శాంతి, ఉల్లాస్, ఆ రోజుల్లో గొప్ప ఆర్టిస్టులు. ముంతాజ్ శాంతి కోసం జనం విరగబడి చచ్చేవారు. నా మట్టుకు నేనూ, ముంతాజ్ కోసమని కలవరించే వాణ్ణి. "ధీరే ధీరే" అన్న పాట — రామనామం కన్నా కూడా పాపులర్ అయిందా రోజుల్లో. క్యూలో నిలబడ్డం, మట్టి మశానం ఏమి లేవు. విరగబడి, తోసుకొని, ముందు కెళ్ళిన వాడికి టిక్కెట్టు., లేదో - ఏడుస్తూ కొంపకు పోవాలి.

మిలటరీ వాళ్ళంటే, మామూలు జనానికి వల్లమాలిన భయం. మమ్మల్ని చూస్తూనే దోవ ఇచ్చేవాళ్ళు. కొంతమంది పరారయ్యేవారు. మేం కూడా జనాన్ని భయపెట్టడానికే ప్రయత్నించే వాళ్ళం.

గేటు పక్కగా నుంచున్నది రమణ. టికెట్ దొరక లేదు గావును అటూ ఇటూ చూస్తున్నది. రమణను ముందుగా పలకరించింది నేనే! టికెట్ చూపించుతూ 'కావాలా' అన్నాను. తలూపింది. డబ్బివ్వ బోయింది, తీసుకోకుండానే లోపలికి వెళ్ళాను,

సినిమా చూశానా? ముంతాజ్ శాంతి పాడిందా? అశోక్ కుమార్ ఏంచేశాడు? ఇవేవీ పట్టలేదు. జనంలోంచి దూసుకుపోయి, రమణను జబ్బ పుచ్చుకొని, కారులో వేసు కొని, ఏ కొండల్లోకో పారిపోయి, అక్కడే ఉండి పోవాలని పించింది. దాన్ని వెతుకుతూ ఎవరన్నా వస్తే, తుపాకితో కాల్చి చంపుదామనిపించింది.

ఇంటర్వల్ టైంలో నిలబడి చూశాను. వేరుశనక్కా యలు కొంగులో పోసుకొని తింటున్నది రమణ. ఇటు చూడదు, తిరగదు. కనీసం మరోసారి పలకరించాలన్నా యివ తలికిరాదు.

రమణను రెండోసారి మా సెంటరు దగ్గరే చూశాను. రోడు వారగా, మైలురాయి దగ్గర కూచున్నది. అల్లంత దూరంలో, గేదెలున్నాయి. దగ్గరగా వెళ్ళాను. దగ్గాను. అవ

తల ఎవరో ఉన్నట్టూ, వారికేదో పని చెబుతున్నట్టు, పెద్దగా మాట్లాడాను. అప్పుడుగానీ, ఇటు తిరిగింది కాదు రమణ. చూసింది. పలకదు. కళ్ళు విప్పళించి ఏదో అనబోయి, మానేసింది. మోకాళ్ళమీది కున్న చెంగులను, కిందికి జార్చింది.

రోజూ, ఆ రోడ్డు పొంతనే రమణను చూస్తూండేవాణ్ని. అయిదారు గేదెల్ని మేపుతూ కనిపించేది. ఒక్కోసారి, మేం డ్రిల్ చేసే మైదానం దగ్గర కనిపించేది, కొన్నిసార్లు, దూరంగా, వంతెన దగ్గర కనిపించేది. ఏదోలా సందుచేసుకొని, ఆ వేళకు అక్కడకు చేరుకొనే వాణ్ని.

“నీ కేం పని లేదా ?” అన్నదో సారి.

నా పని, నా హోదా, జీతం, ఎక్కువచేసి చెప్పాను. ఇంకా పెళ్ళికాలే దన్నాను: మనస్సుకు నచ్చిన వాళ్ళు దొరికితే తప్ప పెళ్ళాడ నన్నాను. ఇవన్నీ ఎందుకన్నానో నా కిప్పుడు జ్ఞాపకం లేదు. విని, పొంగిపోయి, రమణ నాకు లొంగుతుందని కావచ్చు...

రమణమ్మది కంభాల గరువు. అక్కడో చిన్న పెంకుటిల్లుంది. నాలుగెకరాలు పొలం వుంది. పొలంపని లేనప్పుడు, మొగుడు ముఠా పనిలోకి పోతుంటాడు. రోజుకు రూపాయి, రూపాయి పావలా దాకా తెస్తుంటాడు. ఆవిడ పది మంది ఖాతాదార్లకు, వతనుగా పాలు పోస్తుంటుంది.

“మీ ఇల్లు చూడాలని ఉంది.” అన్నా నొక సారి.

రమణ నవ్వింది. నవ్విందిగాని, ఆ కళ్ళలో రవంత

భయం, మెరుపు, నిర్లక్ష్యం, చూశాను నేను.

"ఎప్పుడు రాను ?" అన్నాను మళ్ళా.

"అసలు రానేవద్దు" అన్నది రమణ.

"ఏం ?"

"ఆయన మంచోడు కాదు. చూస్తే ఊరుకోడు. నిన్నూ నన్నూ, గొడ్డలితో నరుకుతాడు" అన్నది రమణ నవ్వి.

"వాణ్ణీ, వాడింటినీ, పునాదుల్తో సహా లేపి, గంగలో కలుపుతాను."

రమణ గలగల్లాడుతూ, లేచి వెళ్ళి, దూడల్ని మళ్ళేసుకొచ్చింది.

"ఆఫీసుకు పోవా! అక్కడ పనేమి ఉండదా ?" అన్నది రమణ.

"మీ ఇంటి సంగతి—"

"రేపు చెపుతాను. ఇక వెళ్ళు. ఎవరన్నా చూస్తే బాగుండదు."

నాగభూషణం—

నువ్వు నిజమనుకో, అబద్ధమనుకో గాని, ఆ రాత్రి నిద్ర పట్టలేదురా! ముందుగానే ఛీ ఛా అన్నట్లయితే, ఏ గుడ్డూ లేకపోను. ఏదో ఆశ, మనస్సును తొలిచి పారేస్తుంది. చేతికి అందుతూ, అందుతూ అందనట్లే అనిపించి, మరీ జారిపోవడం ముంది చూశావూ—అంతకన్న దురదృష్టం మరోటి లేదనుకో.

రమణ ఏడింటికిగానీ రాదు. అంతదాకా—

ఏమయితే అదే అవుతుందని, ఊళ్ళో కెళ్ళాను. ఎవర్నైనా అడిగి ఇల్లు తెలుసుకుందామంటే భయం! రమణమ్మ పేరు తెలుసుగాని, దాని మొగుడు పేరు నాకు తెలీదు. మిలటరీ వాడు, ఓ ఊరొచ్చి, ఒక ఆడదాని పేరు, ఇల్లు అడగడమంటే ఎంత గొడవో ఆలోచించు! ఏమీ తోచక, నాలుగు బజార్లు తిరిగి, పొలాల కడ్డంపడి, వాగు దగ్గర కొచ్చాను. అది దాటాక గాని తాళ్ళ తోపు రాదు. ఆ పక్కనేఉన్న డొంకలో గాని రమణ దొరకదు.

వాగు దాటబోతున్నాను. నిలువెత్తు పెరిగిన నీటి తుంగ వెనకనించి నవ్వు వినిపించింది.

అదరి పోయినా ననుకో నాగభూషణం! వాగు ఎండి పోయినా, అడుగున బురద నీళ్ళున్నాయి. దిగితే బట్టలు ఖరాబవుతాయి. అందుకని దూకేశాను. అరచేతుల కంటిన మట్టి బెడ్డలు దులుపు కొన్నాను.

మళ్ళా నవ్వు వినిపించింది.

ఆ నవ్వు రమణది. తాడి తోపు డొంక దగ్గర ఉండవలసిన రమణ ఇక్కడెందు కున్నది? నన్ను తప్పించుకోవడానికా? ఇంతదూరం నేను వస్తానో రానో చూడాలన్న ఉద్దేశమా?

గేదెల్ని లొద్దుతోకి తోలి, తంగేడు చెట్ల పక్కన కూచుని ఉన్నది రమణ. ఎంత అందంగా ఉన్నదని! నున్నగా

తలదువ్వి, పొన్నాయి పూలు తురుముకొంది. ఒంటిని కరచి పట్టుకున్నట్టున్న రవిక, ఎడంభుజాన్ని కప్పుతూ, వీపునంతా ఆక్రమించుకొన్న ఆకుపచ్చని పమిట, ఊదారంగు కుంకుమ బొట్టు, మెళ్ళో శంఖు తావళం, ఆ తావళం తాకే చోట పైకి ఉబికిన వక్షం...

"నువ్వు నవ్వక పోతే, డొంకదాకా పోయే వాణ్ని" అన్నాను నేను. తుంగ మధ్య చతికిల బడుతూ.

నాకు రమణకూ మధ్య, అయిదారు తుంగ పొదలు అడ్డుగా ఉన్నాయి.

రమణ, నడుం సాచి, మెడ నిక్కించి. అటూ ఇటూ చూసింది.

"ఎవ్వరూ లేరు" అన్నాను.

"అయితే?"

అన్నది రమణ.

ఆమె నవ్వడం లేదన్నమాటే గాని, కళ్ళు మాత్రం, విరగబడి నవ్వుతునే ఉన్నాయి.

"ఎక్కడి కెళ్ళితే అక్కడి కల్లా వెంటపడి వొస్తావుంటే ఎట్లా? నిన్నొదిలించు కోవడం నా వల్ల అయ్యేటట్లు కనిపించ డం లేదే!" అన్నది రమణ.

"నిన్నొదలడం నా వల్లకూడా కాదు. వదల్లేకనే ఇలా తిరుగుతున్నాను."

"అయితే నన్నేం చెయ్యమంటావయ్యా?" అన్నది రమణ.

దానికి సమాధానం నేను నోటితో చెప్పలేదనుకో నాగభూషణం!

ఆ రోజును నేనెప్పటికీ మరచిపోలేను. అప్పటికీ ఇప్పటికీ మధ్య చాలా మంది స్త్రీలు నా జీవితంలోకి వచ్చారు. రమణకన్నా అందమైన వాళ్ళు, హోదా, అధికారం, డబ్బు-ఉన్న వాళ్ళూ, అయితే నేం? దానికదే ప్రత్యేకం. భగవంతుడు కనిపించి, 'నీకేం కావలి రామ్మూర్తీ' అంటే, గడచిపోయిన ఆ నాటి అనుభవాలను, మళ్ళీ ప్రసాదించమని నే నడుగుతాను...

రమణతో దాదాపు ఏణ్నర్థం దాకా నేను గడిపాను. పొలంలోనో, బీట్లోనో, వాగు వొడ్డునో - కలుసుకొంటూ ఉండే వాళ్ళం. ఇంటికి రానిచ్చేది కాదు. రావొద్దనేది. 'ఆయన మంచోడు కాదు' అనేది. చిత్ర మేమిటంటే, రమణమ్మ మొగుణ్ని అప్పటికి ఇప్పటికి నేను చూడనే లేదు—

నేనెంత గింజుకొన్నా ట్రాన్స్‌ఫర్ ఆగింది కాదు. ఉద్యోగం అవసరం లేదన్నాను ముందు జాయినయి, ఆ తరువాత మాట్లాడ మన్నారు. అప్పటికీ నా మీది బోలెడన్ని కంప్లైయింట్సున్నాయి. పిచ్చి పిచ్చి వేషాలు వేస్తే కాల్చి పారేస్తారని భయ పెట్టారు. అయినా పోనీఅని మొరాయించాను. కాని ఏం లాభం? పోక తప్పింది కాదు...

ఆఖరు సారిగా, రమణను, నేను తూము దగ్గర కలుసుకొన్నాను. నెత్తిమీదుగా ముసుగు వేసుకొని, చింత చెట్టు

చాటున నిలబడింది. నన్ను చూస్తూనే బావురు మంటుందను కున్నాను. ఏమీ అనలేదు. ఓ సారి నా ముఖంలోకి చూసి, నా చెంపలను అరచేతులతో రాసింది. నాకు దగ్గరగా జరిగి. గుండెల మీద తల మోపింది.

"ఇంకో పది నిమిషాల కల్లా వాన్ బయలు దేరు తుంది," అన్నాను.

రమణ పలక లేదు.

బొడ్లోంచి ఓ చిన్న పొట్లాం తీసి నా కిచ్చింది.

"ఏమిటది ?"

"ఉంచుకో ... నేను పోతున్నాను."

ఇంకేదో అనా లనుకొన్నాను. అప్పటికే, రమణ, వెళ్ళిపోయింది. బారక్స్‌కు రాలేను. రమణను వదల్లేను. నిలు చున్న వాణ్ని నిలుచున్నట్లుగానే చస్తే బావుండు ననిపించింది నాగభూషణం !

రామ్మూర్తి చెప్పడం ఆపాడు నాగభూషణం ఈ లోగా గ్లాసునంతా ఖాళీ చేశాడు. రెండో దఫా, సగందాకా గ్లాసును నింపి, కొద్దిగా సోడా కలుపుకొని, ఒక్క గుక్కలో దాన్ని తాగేశాడు.

"ఇన్నిటికీ రమణ నీ కిచ్చిన బహుమ తేమిటో చెప్పావు కాదే" అన్నాడు నాగభూషణం

"చెప్పలేదా !" అన్నాడు రామ్మూర్తి, తనూ గ్లాసు నందుకొంటూ, "ఇదుగో! ఇదే ఇచ్చింది. ఇప్పటికీ దీన్ని

వొదలకుండా..."

వేలినున్న ఎనామిల్ ఉంగరం, చూపించాడు రామ్మూర్తి.

నాగభూషణం ముఖంలోకి నెత్తురు ఎగచిమ్మింది. కళ్ళు ఎర్రబడ్డాయి, వొణుకుతున్న చేత్తో, ఆ ఉంగరాన్ని అటూ ఇటూ తిప్పి చూశాడు.

"రమణ ఇచ్చింది..."

"అదే అదే!" అని గొణుక్కున్నాడు నాగభూషణం; కింది పెదవిని కసిగా కొరుక్కుంటూ.